యక్షరాజు చాలా సంవత్సరాలు తపస్సుచేసి, బ్రహ్మదేవుణ్ణి ప్రసన్నంచేసుకుని, విమానంపై యక్షలోకానికి తిరిగొచ్చాడు. రాజసౌధం చేరుకునేలోగా తేరిపారచూశాడు. ఏవీ విజయ దుందుభులు? తనని ఆహ్వానించడానికి ప్రజలంతా బారులు తీరి నిల్చోలేదేం? పూల మాలలు ఎక్కడ? కోలాహలం ఏదీ?

మనసు కీడును శంకిస్తూండగా సరాసరి అంతఃపురంలో వాలాడు. రాజసౌధంలో కూడా ఒక్క పురుగులేదు. ఒక రోజంతా వెతకగా వెతకగా పాతరథాలు, రెక్కలు విరిగిపోయిన పుష్పక విమానాలు లాంటి పాత సామానులు పడేసే గదిలో గడ్డం పెంచుకుని విరాగిలా కూర్చున్న ముసలి మంత్రి మాత్రం కనిపించాడు. ఆయన్ని కుదిపి కుదిపి స్పృహలోకి తెచ్చాక అప్పుడు గుర్తుపట్టాడు రాజుని. వెంటనే యక్షరాజు ప్రశ్నల వర్షం కురిపించాడు. ఏమైంది? రాణులేరీ? భృత్యులేరీ? నా ప్రజలంతా ఏమయ్యారు? ఏ దుర్ఘటన జరిగింది?

# యక్షప్రశ్నలు

## ప్రసన్నకుమార్ సర్రాజు

మంత్రి గాజు కళ్ళతో చూసి, రాజు యక్షప్రశ్నల్ని తట్టుకోలేక ధబ్బుమని పడిపోయాడు. రాజు కంగారుగా ముఖం మీద కాస్త అమృతం చిలకరించాడు. అప్పుడు లేచి, ఓపిక తెచ్చుకుని చెప్పాడు.

"ప్రభూ! మీరు తపస్సుకెళ్ళాక మనవాళ్ళకు పనీ పాటా బొత్తిగా లేకపోయింది. మీరు ఇక్కడ వున్నప్పుడే చూశారుగదా! ప్రశ్నలమీద ప్రశ్నలు. చెప్పేవాడు దొరికాడంటే చాలు. వందల మంది క్యూలో నిల్చుని, చొప్పదంటు ప్రశ్నలు అడగడం. మీరున్నప్పుడు మీకు చేతనైనట్లు చెప్పి వాళ్ళను సమాధానపరిచేవాళ్ళు" అని రాజుగారివైపు నిష్టూరంగా చూస్తూ "మీరు నిజంగా తపస్సు చేసుకోవడానికి వెళ్ళారో లేక వీళ్ళ యక్షప్రశ్నల బాధ నుంచీ తప్పించుకోవాలని వెళ్ళారో గానీ, మీరెళ్ళాక వన్ను తగులుకున్నారు అంతా. ఓపికున్నంతవరకూ చెప్పి చివరికి మొండికేశాను. ఇక లాభంలేదని, అంతా కూడబలుక్కుని యక్షలోకం నుంచీ మాయమై ఆంధ్రదేశంలో మారు వేషాలలో తలా ఓ చోటా తిరుగుతున్నారు ప్రభూ..."

"మరి నా రాణులు?" అడిగాడు రాజు ప్రజలు ఏమైనా చావనీ అనే చిరాకుతో.

"అడ్డమైన ప్రశ్నలకూ జవాబులివ్వడానికి అంతఃపురం రాణులెవ్వరికీ అలుపూ సొలుపూ లేదుగానీ ప్రభూ, సామాన్య ప్రజ రాణీవాసపు స్త్రీలతో పిచ్చాపాటీ మాట్లాడడం విరుద్ధం గదా! అంచేత నగరం అంతా ఖాళీ అయిన కొన్ని రోజులకి రాణులందరూ అంతర్ధానమై ప్రశ్నలడిగేవాళ్ళను వెతుక్కుంటూ ఆంధ్రదేశంలోనే అక్కడక్కడా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు ప్రభూ... అన్నట్లు తమరు బ్రహ్మదేవుణ్ణి తపస్సుచేసి మెప్పించారని విన్నాను. ఏం కోరికలు కోరారు ప్రభూ?" అడిగాడు మంత్రి.

"ఆ ... నా బొంద...నాకేం కోరికలుంటై...! ఉత్తినే కొన్ని సందేహాలకి సమాధానాలు కనుక్కుందామనీ.." సాలోచనగా చెప్పాడు రాజు.

ధబ్బుమని శబ్దం అయింది. చూస్తే మంత్రి మరి లేవకుండా పడిపోయివున్నాడు.

"ఈ సరుకులు కట్టి వుంచు. మళ్ళీ వస్తాను" చెప్పి స్కూటర్ స్టార్ట్ చెయ్యబోయాడు అప్పారావు.

పచారీ దుకాణంవాడు "సార్! మీరొచ్చేప్పుడు ఇంటి నుంచీ గిన్నెలూ, పళ్ళాలూ తెచ్చుకోండి. వాటిల్లో పోసుకుని తీసుకెడుదురుగాని. అన్నీ రెడీ చేసి వుంచుతాను" అన్నాడు.

అప్పారావు ఆశ్చర్యంగా "గిన్నెలూ, పళ్ళాలూ ఏమిటి? పొట్లాలు కట్టివుంచు" అన్నాడు.

"పొట్లాలు కట్టాలంటే పేపర్లెక్కడ సార్! ఒక్కో పాత న్యూస్ పేపరూ అర్ధ రూపాయికి కొందామన్నా దొరకడం లేదు. ఆ రేటులో కొని పొట్లాలు కట్టామంటే దివాళా తీయాలి సార్" అన్నాడు.

అప్పారావుకి మతిపోయినట్లయింది. "నీ ఒక్క షాపులోనేనా? లేక—"

"నా షాపు, ఈ వూరే కాదు సార్ మొత్తం రాష్ట్రం అంతా ఇదే పరిస్థితి".

అప్పారావు మొన్నటిదాకా హోటల్‌లోనే భోజనం. కొత్తగా శ్రీమతి కాపురానికి వస్తోందని జీవితంలో మొదటిసారిగా సరుకులకి వచ్చాడు. మొన్న ఒక హోటల్‌లో 'స్పెషల్ భోజనం' అంటే రెండు రూపాయిలు ఎక్కువైనా ఏమిటోనని ఆర్డరిస్తే విస్తరాకుల బదులు న్యూస్ పేపర్ పరిచి వడ్డించాడు. "ఏమిటయ్యా ఇది?" అని అడిగితే అరిటాకుల్లో తినడం చీప్ సార్. పేపర్లో తినడమే కాస్ట్లీ. ఈ మధ్య ఫ్యాషన్ కూడానూ" అని ఇకిలించాడు.

పచారీకొట్టువాడితో "పోనీ వార పత్రికలున్నాయి గదా! అరకిలో అరకిలో చొప్పున కట్టు" అన్నాడు.

"వారపత్రిక మొహం చూసి చాలా నెలలయిందండీ. బుక్‌స్టాల్లో కొచ్చిన మరుక్షణం మాయమై పోతున్నాయట. కొని చదివేసినవాళ్ళు తిరిగి పకోడీల షాపుకైనా వెయ్యడం లేదు. దాచేస్తున్నారు" అన్నాడు.

అప్పారావుకి ఈ మిస్టరీ అర్థం కాలేదు.

* * *

ఆంధ్ర దేశంలో రోజురోజుకీ ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఏ సరుకు కొందామన్నా ధర ఆకాశానికంటుతోంది. ఇలాగే పరిస్థితి కొనసాగితే నష్టం వచ్చి, కొన్నాళ్ళకి ఆంధ్రదేశం మూతపడాల్సొస్తుంది. [ఈ వాక్యం చదివితే, ఆంధ్రదేశం అంటే అదేదో ఫలానా అండ్ సన్స్ బిజినెస్ సెంటర్‌లా వుంది కదూ! కాదు నిజంగా ఆంధ్రదేశమే.] మళ్ళీ సెంటర్, ఇరుగు పొరుగు రాష్ట్రాలన్నీ సుభిక్షంగానే వున్నయ్. వాటి వాటి వ్యాపారాలు చక్కగా నిర్వహించుకుంటున్నై.

ముఖ్యమంత్రికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఏదో నిగూఢమైన మూలకారణం వుంది. ఏమిటది?

అత్యవసర కమిషన్ ఏర్పాటు చేశాడు. ఈ సారికి పోన్లే పాపం అని కమిషన్ ఏమీ పుచ్చుకోకుండానే పరిస్థితిని సమీక్షించి రిపోర్టు తయారుచేసింది ఆ కమిషన్. అందులో ప్రస్తుత ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితికి ఒకటే కారణంగా పేర్కొనబడింది.

అది - ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడెక్కడి న్యూస్ ప్రింటూ సరిపోవడంలేదు. అయినా కూడా విపరీతంగా బ్లాక్‌లో కొనబడడంవల్ల తద్వారా దాని పరిణామం నిత్యావసర వస్తువులు, అన్నిటి మీదా పడి, పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది.

ఈ పరిస్థితి చక్కబడడానికి ఒకటే మార్గం. రాష్ట్రంలోని పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్ ఆఫీసులను

సెంట్రల్ గవర్నమెంట్ నుంచీ బతిమాలో బామాలో లాక్కుని రాష్ట్ర ప్రభుత్వ వ్యాపార సంస్థగా చేయాలి. అప్పుడు రెవిన్యూ బ్యాలెన్స్ అవుతుంది. రెవిన్యూ బ్యాలెన్స్ అయితే అన్ని కమాడిటీస్ ధరలూ స్థిరంగా వుంటాయి.

ఈ రిపోర్టు చదివి సీయమ్ ఆశ్చర్యపోయి ఒక ప్రత్యేక గూఢచారి దళాన్ని రాష్ట్రంలో నలుమూలలకీ పంపి, అర్జెంటుగా రిపోర్ట్సు పంపమని ఆదేశించారు.

రెండు రోజుల్లోనే రిపోర్టు వచ్చింది. రాష్ట్రంలోని కొన్ని వేల పోస్టాఫీసులు అన్నీ కిటకిటలాడిపోతున్నాయి. సరుకు విపరీతంగా అమ్ముడు పోతోంది. [సరుకు అంటే కార్డులు, కవర్లు] గూఢచారిదళం గ్రూపులు గ్రూపులుగా విడిపోయి, పెద్ద మొత్తాలలో కార్డులు, కవర్లు కొన్నవాళ్ళలో కొంతమందిని రహస్యంగా అనుసరించి కనుక్కున్నదేమిటంటే, రాష్ట్రంలో కుప్పలు తెప్పలుగా పబ్లిష్ అవుతున్న వారపత్రికలకి, మాస పత్రికలకి రాసి పడేస్తున్నట్లు తెలిసింది. ఇలా వ్రాసే ప్రతి ఉత్తరమూ వృధా పోవడం లేదని, తమ పేరు [తరచుగా ఫోటోలు] పడుతున్న పత్రికలని కొనుక్కుని భద్రంగా దాచుకుని మురిసిపోతున్నారని చెప్పి, మచ్చుకి కొన్ని పత్రికలు సీయమ్ ముందర పెట్టారు గూఢచారి దళం.

ఆయన ఓపికగా అన్నీ తీసిచూశారు.

ఉత్తరాల శీర్షిక...సరేసరి. అదికాక ప్రతీపత్రికలోనూ రమారమి అరడజను సీరియల్సు పడుతున్నై. ప్రతీ సీరియల్ ఒక పేజీ, మహా అయితే రెండు పేజీలు మాత్రమే ప్రచురించి సశేషం వేస్తున్నారు. తరువాత కనిపించింది ఆయన వెతికేది.

రచయిత/రచయిత్రి పాఠకుల ప్రశ్నలకు సమాధానాలివ్వడం. వాళ్ళ ఫోటో కూడా వేసి వుంది.

ఆ ప్రశ్నల సరళి ఇలా వుంది.

పి. ఉత్తర — అనుమాన్ జంక్షన్


అక్కయ్యా! ప్రేమలో సానుభూతి అవసరమా, లేక సానుభూతిలో అనురాగం ముఖ్యమా? లేక అనురాగ ప్రేమతో రెండు కన్నీటి బిందువులు రాలడం అవసరమా?


జ: ప్రేమభూతిలో సానురాగం, సామవేదంలో భామరాగం రెండింటికీ ముఖ్యం తృష్ణ.

ఒక అభాగ్యురాలు — ఊరు పేరు లేదు.

నేను అవివాహితను. మీ సీరియల్ చదవడం మొదలెట్టి 9 నెలలు పైనయింది. మీ మొదటి సంచికలో మీరు స్త్రీ స్వాతంత్ర్యానికీ, సుఖసంతోషాలకీ అన్ని దార్లూ వెతకాలని నినాదం ఇచ్చారు. నేనొక అడ్డదారి కనిపెట్టాను—ఇప్పుడు నాకు కూడా నెలలు నిండినై. మీ సీరియల్ అయిపోయేలోపల నాకో మార్గం చూపిస్తారని (పత్రికాముఖంగా) ఆశిస్తాను—కన్నీళ్ళతో..

జ: నేను రాసిన దారుల్లో నువ్వెన్నుకున్న దారి వుండడం కేవలం యాదృచ్ఛికం. సీరియల్ చించుకుంటే బైండు పుస్తకంలో పడుతుంది. ధైర్యంగా వుండు. పుట్టబోయే బిడ్డకు ఈ ఆంటీ పేరు పెడతావు కదూ?






ఇంకో పత్రిక తిరగేశారు ముఖ్యమంత్రి.

సందు రాంబాబు ఊసరవెల్లి పోస్టు
మందు శ్యాంబాబు

అన్నయ్యా! మీ డేరింగ్ డాష్ నవలల్ని మేము, ముఖ్యంగా మా అక్కయ్యలు-అమితంగా ఆరాధిస్తాము. మీ ఫోటో పంపుతారా? దాన్ని భద్రంగా గుండెల కదుముకుని వెచ్చటి కలలు కంటూ రోజూ నిద్రపోతాం.

జ: మీ అభిమానానికి కృతజ్ఞుడిని. రెండు ఫోటోలు పంపిస్తానుగానీ వాటిని మీ అక్కయ్యలకివ్వడం మర్చిపోకండేం?

కు.తూ.హలం. చిక్కందిరాబాద్.

నా పూర్తి పేరు కుమారి తూటాల హలం. సినిమా యాక్టర్ హలం పేరు పెట్టుకున్నాను. నేను నాలుగు ప్యాసయ్యాను. మీ నవల్లు నన్ను ఇగ్నానవంతురాల్ని చేస్తున్నయ్యి. మీకు నా కృతగ్నతలు. మీ కలం ఎంతో బాగుంటుంది. మీ కలాన్ని మీరు ఏ సమయంలో వాడతారు? పగటిపూటా? రాత్రా?

జ: మీ ఉత్తరం నాలో కోలాహలాన్ని, హాలాహలాన్ని రేపింది. నా కలానికి రాత్రి, పగలు భేదం లేదు. దగ్గర్లోనే వున్నారుగదా! స్వయంగా వస్తే చూపిస్తాను.

ముఖ్యమంత్రి చిరాకుగా వేరే పత్రిక చూశారు.

ఒక సోదరి...

అతను మళ్ళీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. నాకు తల కొట్టేసినంత పనయింది...

జ: జల పుష్పాలెప్పుడూ సుగంధ పరిమళాల్ని పీచలేవు.

రెండు సంవత్సరాల తర్వాత తిరిగొచ్చాడు. నాలో తీవ్ర సంక్షోభం చెలరేగిందని గ్రహించాడు. నేనేమీ మాట్లాడలేదు. నాకెన్నో నెల అని అడిగాడు...

జ: పరిణామ క్రమాన్ని గ్రహించలేని ప్రబుద్ధులు అప్పుడూ ఇప్పుడే కాదు. ఎప్పుడూ వున్నారు, వుంటారు.

నా కడుపులో బిడ్డకు తండ్రెవరని అడిగాడు. 'నువ్వే' అని చెప్పలేదు. చెప్పినా ప్రయోజనం ఏం వుంటుంది?

జ: జూలియస్ సీజర్ కాలంలో జనరల్ ఆర్మీకి ఒక హైకమాండర్ వుండేవాడు. అతని పేరు గ్రీజరిన్ రోమియాకో అనుకుంటా—యుద్ధం నుంచీ తిరిగొచ్చి తన కన్నకొడుకునే ఖడ్గంతో నరకబోయాడు.

నాకు దారి తెలియడం లేదు. అంతా అగమ్యంగా వుంది. కుట్టుపని పాఠశాలలు ఎక్కడున్నాయో చెప్పి కాస్త పుణ్యం కట్టుక్కోరూ?

జ: మీ ఊళ్ళోని ధర్మసంస్థల్నీ, వారు నడిపే సత్రాలని ఆశ్రయించండి. ఏదోదారి దొరక్కపోదు.

ముఖ్యమంత్రికి బీపీ పెరిగింది. ఒక పత్రికలో 'కాకి పిల్లలు' శీర్షిక క్రింద చిన్నారి బాలల ఫోటోలు కొన్నివేశారు.

చివరిగా ఇంకో పత్రికలో శీర్షిక

—అడక్కపోయినా చెబుతా—

సి. చుంచులక్ష్మి కలుగు (పోస్టు)

మీరు పైనా కిందా?

జ: మధ్య.

వంట సుబ్బమ్మ బూరెల్లంక.

గారెలకు చిల్లు ఎలాపడుతుంది?

జ: వేలుపెట్టి తిప్పడం వల్ల.

బొందు బంగారి ముట్లూరు.

మీరు నాలో పది'లంగా'..పొదువు విప్పండి చూద్దాం..

జ: విపు'లంగా' విప్పండి మీరే.

మానవతి సిగ్గులూరు.

మీకు లేకపోతే మాకైనా వుండాలి గదా!

జ: నాకు లేనిది మీకు మాత్రం వుండాలని రూలెక్కడుంది?

ముఖ్యమంత్రిగారు బిగదీసుకుపోయారు. ఇది వరకు ఈ పత్రికల్ని ఉబుసుపోకకి అడపాతడపా చదివే వారు. ఈ మధ్య ఈ రాజకీయాలతో బొత్తిగా పత్రిక తిరగెయ్యడానికి టైం వుండడంలా. నిజంగా అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు! సాహిత్య విలువలు ఏమై పోయాయి? లిటరసీ పెరిగిందని పత్రికల సేల్స్ పెరగడంతో తెలుస్తోంది. కానీ ఎందుకీ పనికిమాలిన లిటరసీ? ఈ అడగడాలేమిటీ, ఈ చెప్పడాలేమిటి? అడిగేవాడికి చెప్పేవాడు లోకువా లేక చెప్పేవాడికి అడిగేవాడు లోకువా? ఒక విశ్వనాథ్ పోతే పది విశ్వనాథ్‌లు పుట్టరేం? ఒక గోపీచంద్ లేకపోతే వంద గోపీచంద్‌లు తయారవరేం? బుచ్చిబాబు, అడవి బాపిరాజు...తిలక్...కుటుంబరావులతోనే సాహిత్యం అయిపోయిందా? రావిశాస్త్రి రాయరేం? కాళీపట్నం ఎందుకు అస్త్రసన్యాసం చేసినట్లు?—?

ముఖ్యమంత్రిగారికి కనులు చెమ్మగిల్లాయి. ఏదో చెయ్యాలి. ఏం చెయ్యాలి? ఆ క్షణంలో ఆయనకి కలిగిన ఆవేశంలో ముంథర తెలుగు సాహిత్యాన్ని మరమ్మతు చేసే ప్రక్రియల్ని కనుక్కొని అమలుపరుస్తానని ప్రకటన చేశారు.

* * *

కొన్ని రోజుల తర్వాత—

మంత్రివర్గ సభ్యులతో చర్చించారు. మాటల సందర్భంలో "పోనీ పత్రికలను రద్దుచేద్దామా?" అన్నారు. అంతా తలలూపారు. శెక్రటరీ లేచి, ఆయన చెవిలో ఏదో చెప్పాడు. ఆయన ఏదో గుర్తుకు వచ్చినట్లు "ఆ ...అవును...ప్రకటించాం కదా! సరే. సరే.. మరేం చేద్దామో చెప్పండి" అన్నారు. చివరికి చర్చల అనంతరం మనిషికి రోజుకి రెండు కార్డులు, ఒక కవరు చొప్పున కోటా విధించదల్చినట్లు, ఈ విషయమై కేంద్రంతో సంప్రతింపులు జరపాల్సిందిగా నిర్ణయించేశారు. పత్రికల యాజమాన్యంతోకూడా సంప్రతింపులు జరపవలసిందిగా ఆర్డరు చేశారు. అంతా జైజై ధ్వానాలు చేశారు.

* * *

అప్పారావు ఆనందంగా ప్రతి నెలా సరుకులు హాయిగా పొట్లాలు కట్టించుకుని ఇంటికి తీసుకువెడుతున్నాడు.

* * *

యక్షులంతా తమ లోకానికి వెళ్ళిపోవడానికి మూటాముల్లె సర్దుకున్నారు. ఈ విషయం తెలిసిన యక్ష మంత్రి పిక్కబలం కొద్దీ హిమాలయాలకు పరుగుతీశాడు—తపస్సు చేసుకోవడానికని.

*

ఒక్కమాట

'85 దీపావళి ప్రత్యేక సంచికలో శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారి ఎడిటోరియల్ చదివాక ఉద్భవించింది ఈ కథావేదన. అన్ని పత్రికలూ కొని ఏ పేజీలో ఏం వుందోనని ఆశగా, ఆర్తిగా, జాలిగా వెతుక్కుంటూ చివరికి ఏమీ దొరక్క నిస్పృహతో నిరాశ చెందే ఈనాటి 'కొంతమంది' సాహిత్యాభిమానులకు ఈ కథ అంకితం.

—ప్రసన్న